# బలం

వాకిట్లో పొయ్యి మండుతోంది. పొయ్యి మీద పులుసు మరుగుతోంది.

మురుగు కాలవ పక్కన తనంత తనే మొలిచింది వంగ మొక్క. ఆ మొక్కకి కాసిన వంకాయలు నాలుగూ కోసి పులుసెట్టింది పార్వతి.

పొద్దు వాటారుతున్న వేళ, ఎర్రని సింధూరపు రంగు ఎండ నేల మీద నీడల్ని పొడుగ్గా సాగదీస్తోంది.

పెంకుల మిల్లుల బట్టీలు అంటించినట్టున్నారు, నల్లని ఊక పొగ నెమ్మదిగా గాలితో కలిసి ఊరంతా అలుముకుంటోంది.

కొబ్బరాకులు రెండు ఎవర్నో అడిగి తెచ్చుకున్నట్టుంది పాపమ్మ పక్కనే వాకిట్లో కత్తిపీట కాలి ముందేసుకుని ఈనెలు తీస్తోంది-

"వంకాయి పులుసా, ఎండు చేపలయ్యా ఏవీ ఎయ్యలేదా? ఏం బాగుంటాది ఉత్తొంకాయి పులుసు, నాకైతే ముద్ద దిగదు బాబా" స్వగతంలాగ అనుకుంటోంది.

పాపమ్మ మాటలకి ఏదో గుర్తొచ్చినట్టై పార్వతి పొయ్యి ముందు నుంచి లేచి లోపలికెళ్లింది. గూట్లో పిడతలో ఉన్న రొయ్యపొట్టును తెచ్చి కడిగి, పులుసులో జారవిడిచింది. క్షణాల్లో కమ్మని వాసన వీధంతా అలుముకుంది.

"అమ్మే పారువోతీ, పొద్దున్నొండుకున్న వొణ్ణంలోకి ఈపూట కలుపుకోటానికేవీ లేదు, కుసింత పులుసెయ్యేం" అంది పాపమ్మ గొంతులోకి వీలైనంత మదింపు తెచ్చుకుని.

అవుననీ కాదనీ అనలేక అవస్థ పడింది పార్వతి. రెండు రూపాయల చింతపండు పులుసది. రెండ్రూపాయలకీ నిమ్మకాయంత చింత పండొచ్చింది.

వంగపిందెలొక్కటి తప్ప సమస్తం రూపాయల్తో కొన్నవే, తెర్లుతున్న పులుసులో పైకి తేలి అడుక్కి పోతున్న ఉల్లిపాయముక్కల్లో కూడా నాణేలు కన్పిస్తున్నాయి పార్వతికి.

పొరుగింటమ్మకి పోరటెట్టే రోజులా ఇవి?

అయినా తప్పదు, పాపమ్మకి పులుసేసి తీరవలసిందే, పాపమ్మకి రెండు గదుల తాటాకిల్లుంది. అందులో ఒక గదిలో అద్దెకే అయినా తమని ఉండనిచ్చింది. అద్దె కట్టటం నాలుగు రోజులు ఆలస్యమైనా ఏమీ అనదు.

నిజానికి పెనం మీంచి పొయ్యిలోకొచ్చి పడినట్లైంది పార్వతి పని. వచ్చిన మర్నాడే "ఇదేం గోరకలి ఊళ్లోకి వచ్చిపడ్డాంరా బగమంతుడా" అనుకుంది.

పార్వతికి పదమూడో ఏటే పెళ్లైంది. పుట్టింటికీ అత్తింటికీ ఆరు మైళ్ల దూరం. శంకారం అవతల చిన్న పల్లెటూరది. నలభై గడపల ఊరు. బస్సెక్కాలంటే నాలుగు మైళ్లు నడిచి రోడ్డు మీదికి రావాలి. ఉన్న నలభై గడపల్లో పది గడపలు అత్తింటి వాళ్లవీ, ఆడపడుచులవీ.

ఏ కూరొండుకున్నా నాలిక మీద పడేదాకా నమ్మకం ఉండేది కాదు. వారానికోరోజెళ్లే సంతలో ఓ రూపాయెట్టి ఏ కొబ్బరుండో కొనుక్కుని నాలిక మీదేసుకుంటే ఆ విషయం మీద అమ్మలక్కలందరూ ఊసెట్టుకునేవారు.

కాని, ఏమాటకామాటే చెప్పుకోవాలి; ఊరి కంచె దాటి నాలుగడుగులు నడిస్తే అడివొచ్చేది. నలుగురూ జట్టుకట్టుకుని అడివిలోకెల్తే నాలుగు రోజులకి సరిపడా పొయ్యి మీదికీ, పొయ్యి కిందికీ గ్రాసం తెచ్చుకునేవారు. మేకల్ని తోలుకుని కొండల మీదికీ గుట్టల మీదికీ వెళ్లిన మొగోళ్లు, సాయంత్రం వచ్చేటప్పుడు ఏ కుందేటినో, కొక్కర పిట్టనో పై పంచెలో మూట గట్టు కొచ్చేవారు. పిల్లల కోసం తేగలో దుంపలో తెచ్చేవారు. బిందె పుచ్చుకుని అరమైలు నడిస్తే తియ్యటి కొండగెడ్డ నీళ్లు కడుపు నిండా తాగినన్ని తాగి, పట్టుకుని తెచ్చుకునే వాళ్లు.

ఇక్కడేం ఉంది - బూడిద. అవును, బూడిదే. ఊరంతా ఎగిరిపడి, ఊపిరితిత్తుల్లో తిష్టవేసి రకరకాల రోగాల్ని తెప్పించే బూడిద.

రూపాయిల్లేందే రోజు గడవని ఊరిది.

అసలీవూరు తమనెలా గేలం వేసి లాక్కొచ్చిందో గుర్తుకొచ్చింది పార్వతికి-

రెండేళ్లక్రితం పార్వతి అక్క కూతుర్ని ఈ వూరిచ్చేరు. పెళ్లికూతురు అత్తోరింటికి మూడు నిద్దర్లకొస్తున్నప్పుడు వెంట పార్వతీనీ, వాళ్లాయన తిరపతినీ పంపించేరు.

ఊరి చుట్టూ పెంకుల మిల్లులున్నాయి. ఊళ్లో పెద్ద పెద్ద మేడలున్నాయి. నాలుగు సినిమా హాళ్లున్నాయి. వీధుల్లో కుళాయిలున్నాయి. పెళ్లికొడుకింట్లో తండ్రి నలుగురూ మిల్లు పనికే వెళ్తారట. వాళ్లింట్లో నలుపు తెలుపుల టీవీ ఉంది. దాంట్లో రోజంతా సినిమాలొచ్చే కనక్షనుంది. ఆడోళ్లకి ఇరవయ్యారు, మొగోళ్లకి నలబయ్యి రోజు కూలంట. వారానికోసారి బట్వాడా. ఒక రోజు సెలవు తీసేసినా ఆరు నలబైలు రెండు వందల నలబై, ఆరు ఇరవయ్యార్లు నూటేబైయ్యారు- ఇద్దరూ పన్లోకెళ్తే ఎన్ని డబ్బులు సంపాదించొచ్చో గబగబా లెక్కలేసింది.

అప్పట్లో పార్వతికి ఈ ఊరొక స్వర్గ లోకం లాగ కన్పించింది. ఆ మాటే తిరపతితో అంటే అవునన్నాడు.

అతనికి నచ్చినవి వేరే ఉన్నాయి.

ఊరి సెంటరు నిండా కాఫీ హోటళ్లు, రాత్రైతే లైట్లతో జిగ జిగ లాడి పోతున్న బ్రాందీ షాపులు, సారాయి కొట్లు, పగలంతా మిల్లులో మట్టి పని చేసినా రాత్రికి ఇస్త్రీ బట్టలేసుకుని, బుగ్గన కిళ్లీలు బిగించి సినిమా హాళ్ల దగ్గర, పేకాట పాకల దగ్గర చేరిపోయే జనాలు అతనికి చాలా నచ్చారు.

ఊళ్లోకి మొబైలు హెల్తు సెంటరొచ్చినప్పుడు ఇద్దరు పిల్లలు చాలనుకుని ఆపరేషను చేయించుకున్నారాయె.

ఇంకేవుంది! ఖర్చు తక్కువ, సంపాదన ఎక్కువ, బోలెడన్ని డబ్బులు నిలవెయ్యొచ్చు, కోరుకున్నవన్నీ కొనుక్కోవచ్చు. పార్వతికైతే ముందుగా కావాల్సింది టీవీనే. ఒక గొప్ప రంగుల ప్రపంచం కళ్ల ముందు కదులుతూండగా బతికితే ఈ ఊళ్లోనే బతకాలని తిరిగెళ్లే బస్సులో నిర్ణయించేసుకున్నారు.

ఊరెళ్లేక తమకున్న మేకల్ని అయిన కాడికి అమ్మి పడేసి, అరెకరం కొండ్ర అన్నదమ్ములకి అప్పగించేసి, శుభ్రం చేసుకుని దీపం పెట్టుకుంటామన్నవాళ్లకి ఉదారంగా

పూరింటిని వదిలేసి, ఉన్న గిన్నెలూ ముంతలూ సర్దుకుని ఈ ఊరొచ్చి పడ్డారు.

వచ్చేక గానీ తెలీలేదు ఇక్కడ ఇంటద్దెలెలా మండిపోతున్నాయో!

తమలాంటి వాళ్లకి అందుబాటులో ఉన్నది ఈ కాలనీ ఒక్కటే.

క్రితం సారి ఎన్నికల ముందు ఆదరాబాదరా చెరువును పూడ్చి, కుటుంబానికి యాభై చదరపు గజాల స్తలాన్ని'ఉచిత పంపిణీ' చేసినప్పుడు పాపమ్మకీ స్తలం దొరికిందట. కంపదడి, పేడ అలుకుల్తో రెండు గదుల పూరిల్లు కట్టుకుని ఓ గది అద్దెకిచ్చింది. వానొచ్చిందంటే చాలు ఇళ్లు సగం సగం మునిగిపోయి గిన్నెలూ తపేళాలూ తేలిపోతాయి. అందుకే ఇంటికాణ్నుంచి ఒక బల్ల, కావిడి పెట్టి తెచ్చుకుని వాటి మీద సద్దుకున్నారు సామానంతా. పని దొరికే లోపల తెచ్చుకున్న డబ్బంతా ఖర్చై పోయింది. అప్పుడైనా తిరపతి ఒక్కడికే పని దొరికింది.

"పులుసు మరిగినట్టుంది, అణ్ణం వుంటే పెడతావేటి మజ్జేన్నంది" అన్నాడు తిరపతి చూరుకింద మంచం మీద లేచి కూర్చుని. పార్వతికామాట వినపడిందో, లేదో వెనక్కి తిరిగి చూడలేదు, "నిన్నేనే మాడుమొకందానా, పులుసలాగ మరగబెట్టి మరగబెట్టి ఇగరబెట్టేత్తావేటి!" అరిచేడు తిరపతి.

ఇప్పుడు కూడా వెనక్కి తిరిగి చూడలేదు పార్వతి.

పార్వతి మనసంతా పనికెళ్లిన పిల్లల మీదే వుంది.

వాళ్లు కూలి డబ్బులు తేవాలి, ఆ డబ్బుల్తో బియ్యం కొనాలి, అప్పుడు అన్నం వండాలి. మజ్జాన్నం కుండలో ఊడుపు మెతుకులు కూడా అయిపోయేయని తెలిసీ, తిరపతి అన్నం పెట్టమంటూంటే ఒళ్లు మండుకొత్తా ఉంది పార్వతికి. 'చేతులు అవుడు చేసుకుని మంచమెక్కేడు సరే, ఇలాగ ప్రేణాలు తోడేత్తే ఎలాగ? ఇంతాకలట్టుకుందేటో మనిసికి' అనుకుంది.

'ఇదంతా కర్మం కాకపోతే పెంకుల మిల్లులో కూలీగా ఎల్లినోడు ఎల్లినట్టుండక, ప్రెసిస్సింగు మిసనుకాడ పన్జేసే బద్రం'టీ తాగటానికి బైటికెల్తన్నాను, ఎవడో ఒకడు రంద్రా మిసనుకాడుంటానికి' అంటే ఈ మనిసి పెద్ద మొనగాడిలాగ ఎల్లేడంట.

అలవాట్లేని పని; ఏమైంది, రెండు అరిచేతులూ సకానికి కత్తిరించేసింది మిసను. రక్తకొల్లై పోయిన మనిషిని పట్టుకెల్లి కాకినాడ పెద్దాసుపత్రిలో పడేసి అప్పుడు కవురంపేరు.

లబోదిబోమని పిల్లల్ని తీసుకుని పరుగెడితే, మెలుకువొచ్చేక-"ప్రెస్సింగు మిసను కాడ పని నేర్చుకుంటే కూల్డబ్బులు పెరుగుతాయి కదా అని ఆ పన్జేసేనే" అని బావురుమన్నాడు.

గుండెరాయి చేసుకుని తనే దైర్నం చెప్పవలిసొచ్చింది. అరిచేతుల్లేనోడు ఏం పని చేయగల్డు?

ఆస్పత్రి నించొచ్చి ఆర్నెల్లైనా మనేది పట్టినోల్లాగ మంచవెక్కి మరణిస్తన్నాడు. ఒక అనువులనడు మినువులనడు, కోపం వచ్చినపుడు మాత్రం ఇలాగరుస్తాడు. ఎవరో ఒకరు అన్నం తినిపించవలసిన పరిస్తితైపోయింది. ఇంకే అవసరాలకైనా కట్టుకున్న దానిగా తనకి తప్పడం లేదు.

పిల్లల చదువులు గట్టెక్కి పోయేయి. ఆళ్ల గురించి కన్న కలలన్నీ ఏలేట్లో కలిసి పోయేయి.

అతన్ది కాని పన్లో చేతులెట్టినందుకు మాదేం పూచీ లేదు అనేసేరు పేక్టరీ వోళ్లు. కాళ్లూ ఏళ్లూ పట్టుకుని బతిమాల్తే పిల్లలిద్దర్నీ పన్లో ఎట్టుకున్నారు మారాజులు. పిల్లకి పదిహేను, పిల్లోడికి పన్నిండు ఇస్తన్నారు. ఏదో గుడ్డిలో మెల్ల-

ఆలోచనల్లోంచి బయటపడి కళ్లు తుడుచుకుంది పార్వతి. కంపజారి పోయి పొయ్యెప్పుడో చప్పగా చల్లారిపోయింది. మరగడం ఆగిపోయిన పులుసు మీద కారం ఎర్రగా తెట్టు కట్టింది.

అరవడానికి ఓపిక లేక తిరపతి మంచంలో అటు తిరిగి పడుకున్నాడు.

"రేసను కార్డైనా సంపాదించేరు కారు, తినీ కుడిసీ పిల్లలు, పూటకి రెండు కేజీల బియ్యం ఏ మూలకి? అత్తమాటూ వొణ్ణవో వొణ్ణవో అంటే ఎక్కణ్నుంచి తెత్తాది ఆడమణిసి, ఆ గేణం ఉండొద్దూ మొగోడికి" సణగుతోంది పాపమ్మ.

కాళ్లీడ్చుకుంటూ వచ్చేడు గంగరాజు. కర్రకి కట్టుకొచ్చిన రావి మండల్ని వాకిట్లో కట్టేసి ఉన్న మేకపిల్ల ముందేసి అక్కడే చతికిల పడ్డాడు.

"అక్కేదిరా?" అంది పార్వతి కంగారుగా.

"వస్తంది ఎనకాల, ఇయాళ బట్వాడా రోజు కదా, డబ్బులు తెస్తంది" అన్నాడు.

ఎనిమిదేళ్ల వాడి లేత మొహం రోజంతా ఎండలో పని చెయ్యడం వల్ల కమిలి పోయింది.

కూర్చోడానికి ఆసరా కావాలన్నట్టు రెండడుగులు ఇటు దేకి పార్వతి వీపు వెనక చేరబడ్డాడు. వాడి ఒళ్లంతా కిరసనాయిలు కలిపిన మట్టి వాసన. పచ్చి పెంకులు మోసి మోసి వాడి తల నిండా మట్టి పెళ్లలు కట్టింది.

చెయ్యి వెనక్కి చాపి వాడి పొట్ట నిమరబోయింది పార్వతి. అది లోపలికి పోయి డొక్కకంటుకుపోయింది.

"ఆగమంటుంటే ముందొచ్చేసేడు చూడమ్మా తమ్ముడు" అంటూ వచ్చింది జలాకన్నికి.

ఇంట్లో బియ్యం నిండుకున్నాయని ముందే తెలియడం వలన వచ్చేటప్పుడే రెండు కేజీల బియ్యం పరికిణీలో పోయించుకొచ్చింది. మిగిలిన డబ్బులు తల్లి చేతుల్లో పెట్టి, చేట పట్టుకొచ్చి గింజ కింద పడకుండా బియ్యాన్ని ఒంపింది.

"అమ్మా! పొయ్యిలో కంప ఎగదొయ్యి, ఛెణంలో బియ్యం ఏరేసి, కడిగేసిత్తాను" అంది, ఆ చిరు చీకట్లు ముసురుతున్న వేళ బియ్యం చేటలోకి మొహం వంచేసి చకచకమని నల్లరాళ్లు ఏరిపడేస్తోంది.

పన్నెండేళ్లైనా నిండని ఆ పిల్ల చురుకుతనానికి పాపమ్మ ముచ్చటగా చూస్తోంది.

"ఏ ఇంటికెల్తాదో గాని పార్వతీ, నీ కూతురు బంగారవే" అంది పాపమ్మ.

ఈనెపుల్లలు తియ్యడం పూర్తిచేసి, పురికొసదారంతో మొదళ్లు కట్టి, నేలకేసి కొట్టి చీపుర్ని సరిచేసింది. కత్తిపీట మీంచి లేవబోయి నడుం రాక వంగి నిలబడింది.

"ఒరే బాబా గంగరాజా, ఈసీపురుకట్ట సావుకారికొట్లో ఇచ్చేసి రెండ్రూపాయలిత్తాడు తెచ్చి పెట్టు నాయినా" అంది.

"నాక్కాళ్లు లాగేస్తన్నై. నేనెల్లను" అన్నాడు గంగరాజు వాళ్లమ్మ వీపు మీద మరింత వాలిపోతూ.

"ఉండ్రా, నన్నుగానీ పొయ్‌లో తోసేత్తావేటి" అని కసురుకుంది పార్వతి.

బియ్యం కడిగి పొయ్యి మీదికెక్కిస్తున్న జలాకన్నికి"పోన్లేమామ్మా, నేనెల్తాన్లే" అంది. "నాయమ్మే నా తల్లే, నేన్జెప్పలేదా నువ్వు బంగారానివని" అంది పాపమ్మ వెన్నుని నిటాగ్గా లేపి నిల్చుంటూ.

పార్వతి డబ్బులు ఇంట్లో పెట్టిరాడానికెళ్లింది.

"అక్కా, అమ్మతో చెప్పలేదేం?" అన్నాడు గంగరాజు గుసగుసగా.

"అమ్మ ఏడుత్తాదేమోనని బయవేత్తందిరా" అంది జలాకన్నికి. పోన్లే అది కాపోతే ఉంకోటి, ఊళ్లో మిల్లులకేం కరువు? రేపెల్లేక ఎక్కడోకాడ పని సంపాదిద్దార్లే, అమ్మతో చెప్పొద్దు" అంది.

ఆ రాత్రికే కాలనీ అంతా గుప్పుమంది- బాలకార్మిక చట్టం ప్రకారం పిల్లల్ని పనుల్లోంచి తీసేసేరని.

"అమ్మా, అక్కా నేనూ ఈపాలి బళ్లోకెళ్లిపోవచ్చా"అన్నాడు గంగరాజు సంబరంగా.

తమ్ముడి అవగాహనా లేమికి జాలిగా నవ్వింది జలాకన్నికి. అప్పుడూ అంతే, బడి మానేసి పన్లోకెళ్లడం అంటే గొప్ప సంబరం అనుకున్నాడు. నాలుగు రోజుల్లోనే పనిలోని కష్టాన్ని భరించలేక ఏడ్చిగోలపెట్టేవాడు. తనకే జాలేసేది చెంగు చెంగున ఎగిరే లేడిపిల్ల లాంటి వాడు కాస్తా తల్లి పాలు అందని మేకపిల్లలాగైపోవడం చూసి.

మర్నాడు వాళ్లమ్మకి తనే ఉపాయం చెప్పింది జలాకన్నికి.

పార్వతి తన చీరొకటి రెండు ముక్కలు చేసి జలాకన్నిక్కి పైటేసి పంపింది.

వెళ్లిన గంటలోనే ఏడ్చుకుంటూ ఇంటికొచ్చింది.



కథా నిలయం
5155
శ్రీకాకుళం

"ఏటే పిల్లా పెద్దోళ్ల కూలీ అందేసుకుందారనే? ఏదీ ఎంత పెద్దదానివయ్యేవో సూత్తానుండు" అంటూ పైట లోపల చేతులేసి గట్టిగా పిండి వదిలేడట మేస్త్రీ.

బాధతో, నొప్పితో, అవమానంతో కుళ్లి కుళ్లి ఏడుస్తున్న కూతుర్ని హత్తుకుని తనూ ఏడ్చింది పార్వతి.

రెండేళ్ల నాడు తనకి జరిగిన అవమానం గుర్తుకొచ్చింది-

ఈ వూరొచ్చిన కొత్తలో పాపమ్మతో కలిసి సినిమా కెళ్లింది పార్వతి.

ఇంటర్వెల్లో బాత్‌రూంకెళ్లొస్తూ చెట్ల నిండా విరగబూసిన గులాబీ పువ్వుల్ని చూసి ఓ పువ్వు కోసుకోబోయింది.

చటుక్కున ఓ బలమైన చెయ్యొచ్చి పార్వతి చేతిని ఒడిసి పట్టుకుంది.

ప్రొజెక్టరు రూం మేడమీద నుంచుని డేగ చూపుల్తో ఆడవాళ్లని పరికిస్తున్న అతన్ని చూపించి సాయంకాలం వచ్చేటప్పుడే చెప్పింది పాపమ్మ అతనే ఈ హాలు ఓనరని. మిల్లులూ, తోటలూ, దొడ్లూ ఎన్నున్నాయో అతనికే లెక్క తెలీదని. రోజుకో ఆడదాన్ని పక్కలోకి రప్పించుకునే లెక్క మాత్రం బాగా తెలుసని. కోసిన పువ్వునలాగే వదిలేసి చెయ్యి విదిలించుకుంది పార్వతి.

గబగబా నాలుగు పువ్వులు తుంచి గుత్తిగా పట్టుకుని
"తీసుకో" అన్నాడతను.

"వద్దు" అని పార్వతి గబగబా వచ్చేస్తూంటే-
"అబ్బో చాలా ఉందే, ఎవరు మీరు?" అన్నాడు.

ఆ ప్రశ్నకి అర్థం బాగా తెలిసిన పార్వతి నిలబడి "గొల్లలం" అంది అడుగు కదుపుతూ.

"ఓస్, ఇంకేదో పెద్ద కులంలో పుట్టినట్టు పోజు కొట్టేస్తన్నావే" అన్నాడతను.

ఆ మాటకి పార్వతి గుండె భగ్గున మండినా వాణ్ణేమీ చెయ్యలేక, అనలేక నిస్సహాయంగా తిరిగొచ్చింది.

అవును తనకి కులం బలం లేదు, డబ్బు బలం లేదు, శారీరక బలం లేదు, చివరికి తమ ఊళ్లోలా మంది బలం కూడా లేదు.

ఒకో మనిషిలాగే ఒకో ఊరూ తన నైజాన్ని చూపించుకుంటుంది.

అసలు తమ ఊళ్లో ఏం తక్కువైందని ఈ దూరపు కొండలకి పరుగెత్తుకొచ్చినట్టు?

కళ్లు తుడుచుకుంది పార్వతి.

పొద్దున్న కూతురికి కుచ్చిళ్లు పెట్టి బొడ్లో దోపి వేసిన పైటను లాగి, ఉండ చుట్టి దాన్తో కన్నీళ్లతో మలినమైన కూతురి మొహాన్ని శుభ్రంగా తుడిచింది.

ఇప్పుడేమైందని తామిలా కుమిలిపోవడం?

మొగోడికి అరచేతులు లేకపోవడం నలుగురితో కలిసి మేకలు కాయడానికి అడ్డం కాదు.

ఎప్పట్లాగే తన పిల్లలు నాలుగు మైళ్లు నడిచి ఆశ్రమం బడికెళ్తారు.

కొండల మధ్య, పచ్చని అడవి మధ్య నిశ్శబ్దంగా నిలిచి ఉండే తన ఊరు, పూరిల్లు, తమ వాళ్లు కళ్ళకి కట్టి కొండంత బలం వచ్చింది పార్వతికి.

గిన్నెలూ తపేళాలూ గోతంలో వేసి కట్టమని పిల్లలకి పురమాయించి, వాకిట్లోకొచ్చి నిలబడి-

"పాపమ్మత్తా, ఇల్లు కాళీ చేసి మావూరెల్లిపోతన్నాం" అనరిచింది హుషారుగా.

మంచంలో ముణగదీసుకుని పడుకున్న తిరపతి చటుక్కున ఇటు తిరిగి పార్వతికేసి ఆనందంగా చూసేడు.

పక్కనే ఉన్న మేకపిల్లను ఎత్తుకుని ముద్దాడింది పార్వతి. రేపు ఊరెల్లేక పిల్లల్ని పెట్టి మందను పెంచవలిసింది అదే కదా మరి!

*********

ప్రిసం. నూరేళ్ళ పంట (2000)